దేవీ ఆలయం.. ఉత్సవ శోభితం

- లలితాదేవి దేవాలయం ముస్తాబు
- ఘనంగా 25వ దేవీశరన్నవరాత్రులు
- వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ప్రొద్దుటూరు కల్చరల్ : దసరా ఉత్సవాలు నిర్వహించడంలో ప్రొద్దుటూరు పట్టణం రెండవ మైసూరుగా ఖ్యాతి గడించింది. పలు ఆలయాలు దేవీశరన్నవరాత్రులను వేడుకగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీ లలితాదేవి, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడంలో ఆలయ ట్రస్ట్ కమిటీ తమకంటూ ఒక ప్రత్యేకత సంతరించుకుంది. చిన్న దేవాలయం అయినా భక్తులు ఈ ఆలయంలో అమ్మవారి రూపాలను, బొమ్మలకొలువును తిలకించేందుకు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తారు. ఈ ఏడాది ఆలయాన్ని విశాలంగా, అత్యంత సుందరంగా అధునీకరించడంతో మరింత వేడుకగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు ట్రస్ట్ వారు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో మహావిష్ణు దశావతారాలు, అష్టలక్ష్ములు, అనంత పద్మనాభస్వామి, లక్ష్మీవరాహస్వామి, మహాలక్ష్మీ, మహాకాళి, మహాసరస్వతీ, అర్ధనారీశ్వరులు, గోదాదేవి, సుదర్శనస్వామి, కమలంపై వటపత్రసాయి, శ్రీనివాస కల్యాణం తదితర విగ్రహాలు విశేషంగా ఆకట్టుకునేలా రూపొందించారు. 25 ఏళ్లుగా ప్రతి ఏడాది అత్యంత వైభవంగా దేవీ నవరాత్రులను నిర్వహిస్తున్నారు.

కనుల విందుగా అలంకారాలు

ఈ ఏడాది లోకకల్యాణార్థం ప్రతిరోజు రుత్వికులతో యజ్ఞయాగాదులు, అభిషేకాలు, అర్చనలు చేపడుతున్నారు. 22న రాజరాజేశ్వరిదేవి, 23న భవానీదేవి, 24న శారదాదేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న శ్రీదేవి వనవిహారిణి(పార్వతీదేవి), 27న ధనలక్ష్మీదేవి, 28న బాలాత్రిపుర సుందరీదేవి, 29న సరస్వతీ దేవి, 30న మహిషాసురమర్దిని, అక్టోబరు 1న శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి, 2న విజయలలితాదేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శన మివ్వనున్నారు. రోజూ నిత్యనూతనంగా అమ్మవారి అలంకారాలను తమిళనాడుకు చెందిన కళాకారులు కనుల విందుగా అలంకరిస్తారని, భక్తులు పాల్గొని ఉత్సవాలను తిలకించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ట్రస్ట్ కమిటీ వారు కోరారు.

మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణ

శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ఉత్సవ మూర్తులను అలంకరించడం ఆనవాయితీ. అయితే ఈ ఆలయంలో లలితాదేవి, రతనాల వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌లకు కూడా రోజూ ప్రత్యేక అలంకరణ చేస్తారు. అమ్మవారి మూలవిరాట్‌ను 22న పసుపుతో, 23న ముత్యాల కవచం, 24న వెండి కవచం, 25న డ్రైఫ్రూట్స్, 26న కూరగాయలు, పండ్లు, 27న కరెన్సీ, 28న నిమ్మకాయల మాల, 29న వత్తిపత్తి, 30న గాజులు, 1న ముత్యాలకవచం, 2న పూలతో అలంకరించనున్నారు. అలాగే రతనాల వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌ను 22న తులసి దళాలతో, 23న ముత్యాలకవచం, 24న వెండి కవచం, 25న డ్రైఫ్రూట్స్, 26న కూరగాయలు పండ్లు, 27న నగదు, 28న వడమాల, 29న వత్తిపత్తి, 30న దర్బార్ అలంకారం, 1న ముత్యాల కవచం, 2న పూల అలంకారంలో స్వామివారి మూలవిరాట్‌ను తీర్చిదిద్దనున్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని మహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అరవ చెన్నారెడ్డి తెలిపారు.

దసరా ఉత్సవాల ఆహ్వానపత్రికలు విడుదల

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్లరోడ్డులోని వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో దసరా ఉత్సవాల ఆహ్వానపత్రికలను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం విడుదల చేశారు. 9 రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవస్థానం శాశ్వత ధర్మకర్త ప్రొద్దుటూరుకిషోర్‌కుమార్, అధ్యక్షులు దేవతిసురేంద్ర, ఉపాధ్యక్షులు వడ్లపూటినాగభూషణంలు తెలిపారు. పట్టణ ప్రజలు పూజా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ తిరువీధిలక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీ చిప్పగిరిఆంజనేయులు, దేవతివెంకటసుధాకర్, కమిటీ సభ్యులు సత్యం, సగళాసుబ్బరాయుడు, సొల్లేటిసుబ్బరాజ, నాగఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.




అధునీకరించిన రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయం

నేటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైనట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సుదర్శన్ తెలిపారు. సోమవారం నుండి అక్టోబర్ 3వ తేదీ వరకు దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి గడియలు ప్రవేశించడాన్ని ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఇందులో భాగంగా అమ్మవారు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అలంకారాలు : ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకొక అలంకారంలో దర్శనమివ్వనున్నారు. 22న బాలత్రిపురసుందరిదేవి అలంకారం, 23న పార్వతీదేవి అలంకారం, 24న ధనలక్ష్మిదేవి అలంకారం, 25న కాత్యాయినిదేవి అలంకారం, 26న దేవివనవిహారిణి అలంకారం, 27న రాజరాజేశ్వరిదేవి అలంకారం, 28న అన్నపూర్ణాదేవి అలంకారం, 29న సరస్వతిదేవి అలంకారం, 30న మహిషాసురమర్దిని అలంకారం, అక్టోబర్ 1న భవానిదేవి అలంకారం, 2న విజయలక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు.

నేటి నుంచి దశరా ఉత్సవాలు

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానంలో సోమవారం నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు దశరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.22న శ్రీ రాజ రాజేశ్వరీదేవి అలంకారం, 23న శ్రీ గాయత్రీదేవి అలంకారం, 24న శ్రీ అన్నపూర్ణా దేవి అలంకారం, 25న శ్రీ కామాక్షి దేవి అలంకారం, 26న శ్రీ వనవిహారిణిదేవి అలంకారం, 27న శ్రీ గజలక్ష్మీదేవి అలంకారం, 28న శ్రీ వారాహిదేవి అలంకారం, 29న శ్రీ సరస్వతీ దేవి అలంకారం, 30న శ్రీ మహిషాసుర మర్దినిదేవి అలంకారం, అక్టోబర్ 1 వ తేది శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి అలంకారం, 2న శ్రీ విజయలక్ష్మీదేవి అలంకారం, రాత్రి ఊరేగింపు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. 3వ తేది రాత్రి శ్రీదేవి డోలాహరణం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు ప్రతి రోజు రాత్రి అమ్మవారి అలంకారాలు దర్శించుకొని, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. పోరుమామిళ్ల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి అక్టోబర్ 3 వ తేది వరకు దశరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు.

కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధం

మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి సవాల్



లేఖను చూపుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణంలో కలకలం రేపిన లేఖకు తనకు ఎలాంటి సంబంధం లేదని ప్రమాణం చేస్తా.. లేఖలో పేర్కొన్నట్టుగా ఎవరిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు వసూలు చేయలేదని మీరు ప్రమాణం చేస్తారా అని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్వగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకుడు బస్సు మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోసంగి వెంకటసుబ్బారెడ్డి, బీజేపీ నాయకుడు గొర్రె శ్రీనివాసులు తన కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి కలకలం రేపిన లేఖకు తామే కారకులమని తెలిపారన్నారు. ఇందులో ఏమాత్రం వాస్తం లేదని తెలిపారు. ఈనెల 18వ తేదీనే తన ఇంటికి లేఖ వచ్చిందని, తాను అందుబాటులో లేని కారణంగా మరుసటి రోజు వచ్చి లేఖను చదివానన్నారు. తనతో పాటు తన బావ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, పలువురికి ఈ లేఖలు అందాయన్నారు. వెంటనే తాను గోసంగి వెంకటసుబ్బారెడ్డికి ఫోన్ చేశానని, ఆయన కోరిక మేరకు లేఖను అతనికి వాట్సాప్‌లో పంపడం జరిగిందన్నారు. తర్వాత గోసంగి ఈ లేఖను ఊరందరికి పంపి గబ్బుపట్టించారన్నారు.

మీరు చెప్పినట్లు ప్రమాణానికి సిద్ధమే

మీరు చెప్పినట్లు శివాలయం వద్ద ప్రమాణం చేయడానికి శాంతి భద్రతల కారణంగా పోలీసులు అభ్యంతరం తెలుపుతారని బంగారు మునిరెడ్డి అన్నారు. లేఖలో తొలి అక్షరం నుంచి చివరి అక్షరం వరకు తనకు సంబంధం లేదని తెలుగు రాష్ట్ర ప్రజలదరికి ముఖ్యమైన కాణిపాకంలో తాను ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఆ లేఖను తాను రాయలేదని, రాయించలేదని, ఎవరితో మాట్లాడలేదని ప్రమాణం చేస్తానన్నారు. అలాగే లేఖలో పేర్కొన్నట్లుగా ఎవరిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు వసూలు చేయలేదని కౌన్సిలర్ బస్సు మురళీ ప్రమాణం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అయింది, మేము అవినీతి చేసి ఉంటే ఎందుకు వెలికితీయలేదని ప్రశ్నించారు. టీడీపీ నేతలే స్వయంగా తనకు ఫోన్ చేసి లేఖలో నిజాలు రాశారని చెబుతున్నారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గురునాథరెడ్డి పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

బద్వేలు అర్బన్ : స్థానిక సీపీఐ కార్యాలయం జేవీ భవన్‌లో ఆదివారం జరిగిన దివ్యాంగుల పోరాట సమితి సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడుగా గొడుగునూరు బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా చింతకుంట రఫీ, ఉపాధ్యక్షులుగా జి.ఖాదర్‌బాషా, కదిరుల్లా, సహాయ కార్యదర్శులుగా ముత్యాల రమణయ్య, బి.మునీంద్ర, సంయుక్త కార్యదర్శిగా బి.ప్రసన్నకుమార్, కోశాధికారిగా కడప చిన్నమౌలాలి, మహిళా కన్వీనర్‌గా నాగమణి, గౌరవ సలహాదారులుగా పెద్దుల్లపల్లి బాలు, గౌరవ ఆహ్వానితులుగా పడిగ వెంకటరమణ, జి.మురళి, సభ్యులుగా మరో 11 మందిని ఎన్నుకున్నారు.